EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
సోమవారం
26 ఆగస్టు 2024
పేజీలు: 02




# శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు



హిందువులు మాత్రమే కాదు విదేశీయులు కూడా వైభవంగా జరుపుకునే పండగ శ్రీ కృష్ణ జన్మాష్టమి. కృష్ణుడి పుట్టిన రోజుని కృష్ణాష్టమి, గోకులాష్టమి వంటి వివిధ పేర్లతో పిలుస్తారు. త్రిమూర్తులలో శ్రీ మహా విష్ణువు స్థితి కారుడు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం విష్ణు మూర్తి వివిధ అవతారాలను దాల్చాడు. అలాంటి అవతారాల్లో దశావతారాలు ముఖ్యమైనవి. ఈ దశావతారాల్లో 8వ అవతారం శ్రీ కృష్ణుడు అని నమ్మకం. ద్వాపర యుగంలో శ్రీ కృష్ణుడిగా మహా విష్ణువు జన్మించాడని పురాణ కథనం. దేవకీ వసుదేవుల అష్టమ సంతానంగా శ్రావణ మాసం కృష్ణ పక్షంలోని అష్టమి తిథి, రోహిణి నక్షత్రంలో అర్ధరాత్రి సమయంలో గోపాలుడు జన్మించాడని విశ్వాసం. అందుకనే ప్రతి సంవత్సరం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఈ తిథిలో అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది శ్రీ కృష్ణ జన్మాష్టమి ఏ రోజు వచ్చింది? పూజా శుభ ముహూర్తం ఎప్పుడు? అనే విషయంలో గందరగోళం నెలకొంది. ఎందుకంటే అష్టమి తిథి రెండు రోజులు అంటే మిగులు, తగులుగా వచ్చింది. దీంతో ఈ రోజు జన్మాష్టమిని ఏ తేదీన ఎప్పుడు జరుపుకోవాలి ఈ రోజు తెలుసుకుందాం.. ఆగస్టు 26న కృష్ణాష్టమిని జరుపుకోవాలి. ఈ రోజు కన్నయ్య భక్తులు ఉపవాసం ఉండి.. బాల కృష్ణుడిని అందంగా అలంకరించి సాయంత్రం పూజ చేయాలి. రకరకాల పండ్లు, శొంఠి, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడ, అటుకులతో పాటు రకరకాల వంటకాలను నైవేద్యంగా సమర్పించాలి. ఇక కృష్ణుడు అర్ధరాత్రి జన్మించాడు కనుక ఆగస్టు 26వ తేదీన అర్ధరాత్రి 12 గంటల 5 నిమిషాల నుంచి అర్ధరాత్రి 12 గంటల 51 నిమిషాల మధ్యలో కృష్ణుడికి పూజ నిర్వహించాలి. ఇక ఆగస్టు 27న ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు. వీధుల్లో ఉట్లు కట్టి దానిని కొట్టడానికి పోటీపడతారు. అందుకే క్రిష్ణష్టమిని ఉట్ల పండగ అని కూడా అంటారు. ఇక దేశవ్యాప్తంగానే కాదు విదేశాల్లో కూడా ఘనంగా నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలు.. ఉత్తరప్రదేశ్ లోని మధుర-బృందావనంలో మాత్రం వెరీ వెరీ స్పెషల్.






## రుక్మిణి కాకుండా రాధతోనే కృష్ణుడు ఎందుకు పూజలందుకుంటాడు?

రాధాకృష్ణులు గోలోక వాసులు. ప్రేమ స్వరూపిణి, రస దేవత రాధదే అక్కడ ఆధిపత్యం. ఓసారి కన్నయ్యపై ఆమె అలిగింది. ప్రేమ జగడాలు తెలీని సుధాముడు వందేళ్లు స్వామితో వియోగం తప్పదని ఆమెకు శాపమిచ్చాడు. దాంతో వారి అంశలు రాధాకృష్ణులుగా భూమిపై ప్రేమ, రసారాధన గురించి తెలియజేశాయి. వియోగం కోసం రాధ తపస్సుకెళ్లగా కృష్ణుడిలో నారాయణుడు ప్రవేశించాడు. ఆ తర్వాత రుక్మిణీ కళ్యాణం, సత్యభామా కలాపం, భగవద్గీత, మహాభారతం జరిగాయి.



## ప్రజలకు ప్రధాని, సీఎంల జన్మాష్టమి శుభాకాంక్షలు

దేశ ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేస్తూ పీఎం మోదీ ట్వీట్ చేశారు. ఏ విషయంలోనైనా స్ఫూర్తినిచ్చే శ్రీకృష్ణ తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి అంశంలో విజయం సాధించవచ్చని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. శ్రీకృష్ణుడి కృపాకటాక్షం రాష్ట్రంపై ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. మానవ జీవితంలో 'గీత' బోధనలు ప్రభావశీలమైనవని, ప్రతి దశలోనూ కృష్ణ భగవానుడు కొలువై ఉంటారని తెలంగాణ సీఎం రేవంత్ పేర్కొన్నారు.



## బంగ్లాలో మళ్లీ గొడవలు.. ఉద్రిక్తంగా పరిస్థితులు

బంగ్లాలో ఆదివారం రాత్రి మళ్లీ అల్లర్లు చెలరేగాయి. సెంట్రల్ సెక్రటేరియట్ వద్ద వేలమంది విద్యార్థులు, అన్సార్ సభ్యులు ఘర్షణకు దిగారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు సైనికులు, పోలీసులు సౌండ్ గ్రెనేడ్లను ప్రయోగించినా గొడవలు ఆగలేదు. అన్సార్ సభ్యుల్లో కొందరు బయటకు వెళ్లిపోగా మరికొందరు చిక్కుకుపోయారు. కొత్త ప్రభుత్వం తమపై కుట్ర చేస్తోందన్న స్టూడెంట్స్ సెక్రటేరియట్‌ను తమ నియంత్రణలోకి తీసుకున్నారు.



## లాభాల్లో స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. ఉదయం 9:24 గంటల సమయంలో సెన్సెక్స్ 287 పాయింట్లు లాభపడి 81,373 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ 82 పాయింట్లు పెరిగి 24,905 వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.82 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో టెక్ మహీంద్రా, టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, టైటన్, టాటా మోటార్స్, బజాజ్ ఫైనాన్స్, ఎం అండ్ ఎం, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. ఐటీసీ, సన్‌ఫార్మా, మారుతీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఏషియన్ పెయింట్స్, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎల్ అండ్ టీ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

## తెలుగు రాష్ట్రాల్లోనే మద్యం 'కిక్కు' ఎక్కువ



దేశంలో తెలుగు రాష్ట్రాల్లోనే మద్యం వినియోగం ఎక్కువగా ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ విభాగం నిపెప్ వెల్లడించింది. తెలంగాణలో వార్షిక సగటు తలసరి వినియోగం రూ.1,623 ఉండగా, ఏపీలో రూ.1,306గా ఉంది. ఆ తర్వాత స్థానాల్లో పంజాబ్ 1,245, ఛత్తీస్‌గఢ్ రూ.1,227, ఒడిశా రూ.1,156 ఉన్నాయి. మద్యంపై వస్తున్న ఆదాయం రాష్ట్రాలకు మూడో అతిపెద్ద ఆదాయవనరుగా ఉందని తెలిపింది. అత్యధికంగా గోవా 722% ఆదాయం పొందుతున్నట్లు పేర్కొంది.

# బోయిన్‌పల్లిలో భారీగా డ్రగ్స్ స్వాధీనం

## రూ. 8.5కోట్ల విలువైన 8.5కిలోల ఎఫిటమిన్ డ్రగ్స్‌ను స్వాధీనం



హైదరాబాద్ బోయిన్‌పల్లి పరిధిలో పోలీసులు భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. పక్కా సమాచారంతో రెక్కీ నిర్వహించి రూ.8.5 కోట్లు విలువైన 8.5కిలోల ఎఫిటమిన్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి ఒక కారు 3సెల్‌ఫోన్లు సీజ్ చేశారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం: ఆదివారం రాత్రి ముగ్గరు వ్యక్తులు జిన్నారం నుంచి ఎఫిటమైన్ డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందింది. అప్రమత్తమైన పోలీసులు వారు ఏ దారిలో వస్తున్నారు వంటి వివరాలు తెలుసుకుని అక్కడ కాపలా కాశారు. బోయిన్ పల్లి పోలీసులను అలర్ట్ చేశారు. సుచిత్ర నుంచి ప్యారడైజ్‌కు వెళ్లే క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న మహేంద్ర గ్జైలో కారును వెంబడించారు. డైరీ ఫార్మ్ రహదారిపై పోలీసులు ఆ వాహనాన్ని అడ్డుకున్నారు.

కిలో డ్రగ్స్ కోటి రుపాయలు: అనంతరం వాహనాన్ని తనిఖీ చేయగా కారు డిక్కీలో మూడు పింక్ కవర్లను గుర్తించారు. వాటిని తెరిచి చూడగా అందులో ఎఫిటమైన్ అనే డ్రగ్స్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మొత్తం 8.582 కిలోల మత్తుపదార్థాలను గుర్తించినట్లు చెప్పారు. దీని విలువ రూ.8.50 కోట్లు ఉంటుందని వెల్లడించారు. డ్రగ్స్‌తో పాటు నిందితుల నుంచి కారు, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎఫిటమైన్ డ్రగ్ విలువ కిలో కోటి రూపాయలకు పైగా ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. అనంతరం సంగారెడ్డి జిల్లా వాసి నాగరాజు, కారు డ్రైవర్ వినోద్, మరో పెడ్లర్‌ను అరెస్టు చేశారు.

"నాగరాజు తన అనుచరులు వినోద్, శ్రీశైలంతో కలిసి డ్రగ్స్ దందా చేస్తున్నాడు. గతంలో గుమ్మడిదలలో ఆల్ఫాజోలం తయారీ సంస్థను సీజ్ చేశాం. ఆల్ఫాజోలం తయారు చేస్తున్న అంజిరెడ్డి శిష్యుడు నాగరాజు. నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. విచారణ తర్వాత నిందితులను కస్టడీలోకి తీసుకుంటాం. ఘటనలో ఇంకెవరైనా నిందితులు ఉన్నారా అనేది ఆరా తీస్తున్నాం." - కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్ సీపీ

డ్రగ్స్ సరఫరా చేస్తున్న నైజీరియా మహిళ: మరోవైపు రాజేంద్రనగర్ పోలీసులు డ్రగ్స్ సరఫరా చేస్తున్న నైజీరియాకు చెందిన మహిళను అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. నిందితురాలి నుంచి 50గ్రాముల ఎండీఎంఏ, 25గ్రాముల కొకైన్‌ను స్వాధినం చేసుకున్నారు. వీటిని బెంగళూరు నుంచి తీసుకొచ్చి హైదరాబాద్‌లో సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. దంపతులతో పాటు మరో ముగ్గురు కలిసి మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు సమాచారం.



## అరెస్టైన టెలిగ్రాం సీఈవోకు మస్క్ మద్దతు

టెలిగ్రాం సీఈఓ పావెల్ దురోవ్‌ను ఫ్రాన్స్ అరెస్టు చేయడాన్ని బిలియనీర్ ఎలన్ మస్క్ ఖండించారు. అతడిని వెంటనే విడుదల చేయాలన్నారు. 'స్వేచ్ఛ స్వేచ్ఛ! స్వేచ్ఛ' అని ఫ్రెంచ్‌లో ట్వీట్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో బాలలు పీడితులవుతున్నా దాని యజమాని జుకర్‌బర్గ్‌ను మాత్రం అరెస్టు చేయడం లేదన్నారు. ఆయన వాక్ స్వాతంత్ర్యాన్ని సెన్సార్ చేయడం, ప్రభుత్వానికి లోపాయికారిగా యూజర్ల డేటా ఇవ్వడమే ఇందుకు కారణాలని ఆరోపించారు.

**పావెల్ అరెస్ట్ అసంబద్ధం: టెలిగ్రామ్**

ప్లాట్‌ఫారమ్ దుర్వినియోగానికి బాధ్యుడిని చేస్తూ యజమాని పావెల్ దురోవ్ ను అరెస్ట్ చేయడం అసంబద్ధమని టెలిగ్రామ్ ఓ ప్రకటనలో తెలిపింది. తాము యూరోపియన్ యూనియన్ చట్టాలు, డిజిటల్ సేవల చట్టంలోని పరిమితులకు లోబడి ప్రవర్తిస్తున్నామని పేర్కొంది. ఇందులో దాచడానికి ఏమీ లేదని తెలిపింది. టెలిగ్రామ్‌లో నేర కార్యకలాపాలను అరికట్టడంలో విఫలమయ్యారనే ఆరోపణలతో ఆ సంస్థ చీఫ్ పావెల్‌ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# నేటి నుంచి యూఎస్ ఓపెన్

## సీజన్ ఆఖరి గ్రాండ్‌స్లామ్ టోర్నీకి సర్వం సిద్ధం



టెన్నిస్ క్యాలెండర్‌లో ఆఖరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ అయిన ప్రతిష్ఠాత్మక యూఎస్ ఓపెన్‌కు రంగం సిద్ధమైంది. న్యూయార్క్ వేదికగా జరుగబోయే ఈ టోర్నీకి సోమవారం నుంచి తెరలేవబోతోంది. నేటి నుంచి పురుషుల, మహిళల సింగిల్స్ మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. డిఫెండింగ్ చాంపియన్లు నొవాక్ జొకోవిచ్ (పురుషుల), కోకో గాఫ్ (మహిళల) తమ టైటిల్స్‌ను నిలబెట్టుకునేందుకు బరిలోకి దిగుతున్నారు. పురుషుల కేటగిరీలో కార్లోస్ అల్కారజ్, జన్నిక్ సిన్నర్, డేనియల్ మెద్వెదెవ్, ఆండ్రీ రుబ్లెవ్, అలగ్జాండర్ జ్వెరెవ్, ఫ్రాన్సెస్ టియాఫో, టేలర్ ఫ్రిట్జ్ వంటి స్టార్లు టైటిల్ వేటలో ఉన్నారు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ ఇగా స్వియాటెక్, అరీనా సబలెంక, జాస్మిన్ పలోని, ఎలీనా రిబాకినా, జలెనా ఒస్టపెంకో, యువ సంచలనం మిర్రా అండ్రీవాతో పాటు పారిస్ ఒలింపిక్ స్వర్ణ విజేత కిన్వెన్ జెంగ్ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గతేడాది ఇక్కడే తన కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గి 25వ టైటిల్ కోసం ఏడాదిగా వేచి చూస్తున్న జొకోవిచ్ మరోసారి తనకు అచ్చొచ్చిన యూఎస్ ఓపెన్‌లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియా, ఫ్రెంచ్, వింబుల్డన్ టోర్నీలలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా ఇటీవలే ముగిసిన విశ్వక్రీడలలో స్వర్ణం సాధించడం జొకోలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.



## పోరాటానికి సిద్ధమైన ఆర్‌టీసీ సిబ్బంది


పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌టీసీ కార్మికులు పోరాటానికి సిద్ధమయ్యారు. ప్రభుత్వంలో విలీనం పూర్తి చేయడం, 2 పీఆర్‌సీలు, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 27న ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు చేపట్టనున్నారు. సెప్టెంబర్ 10న డిమాండ్స్ డే, అక్టోబర్ 1న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద సామూహిక దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM



# భూకంపం సృష్టిస్తా
## తీన్మార్ మల్లన్న

బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయకపోతే భూకంపం సృష్టిస్తానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించారు. బీపీ మండల్ జయంతి సందర్భంగా నిన్న హనుమకొండలో బీసీల శంఖారావం సభలో ఆయన పాల్గొన్నారు. 'రిజర్వేషన్లు అమలు చేయకపోతే ప్రజల్లో ఒక్కరు కూడా తిరగలేరు. తెలంగాణలో బీసీ సర్కార్ రాబోతోంది. బీసీలను గెలిపించేలా కేసీఆర్‌కు వినతి ఇచ్చేందుకైనా నేను వస్తా. ఇలా మాట్లాడినందుకు మహా అయితే పదవి పోతుంది' అంటూ ఆవేశంగా మాట్లాడారు.



# నిమ్స్‌లో గురక సమస్యకు ట్రీట్‌మెంట్

గురక సమస్యకు చికిత్స అందించేందుకు హైదరాబాద్ నిమ్స్‌లో ప్రత్యేక ల్యాబ్ సిద్ధమవుతోంది. ప్రైవేటు ఆసుపత్రులతో పోలిస్తే నాలుగో వంతు ఖర్చుతోనే ఈ సేవలందిస్తామని డైరెక్టర్ డా.బీరప్ప తెలిపారు. అధిక బరువు, ధూమపానం, మద్యపానం అలవాట్లు, శ్వాస నాళాల్లో అడ్డంకులు గురకకు దారి తీస్తాయి. దీనివల్ల కొన్నిసార్లు మెదడుకు ఆక్సిజన్ ఆగిపోయి పక్షవాతం వచ్చే ముప్పు ఉంటుంది. ల్యాబ్‌లో బాధితులపై అధ్యయనం చేసి, చికిత్స అందిస్తారు.



# మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ ఎంపీ
# వసంత్ రావ్ చవాన్ ఇకలేరు!

మహారాష్ట్ర రాజకీయాలలో సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ వసంత్ రావ్ చవాన్ కన్నుమూశారు. 70 ఏళ్ల వయసు గల నాందేడ్ ఎంపీ వసంత్ రావ్ ఆగస్టు 26, సోమవారం ఉదయం తుది శ్వాస విడిచారు. చాలా రోజులగా అనారోగ్యం కారణంగా ఆయన హైదరాబాద్ లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఆదివారం రాత్రి ఆయన ఆరోగ్యం విషమంగా మారింది. ఆ తరువాత డాక్టర్లు ఆయనను కాపడడానికి ఎంత ప్రయత్నించినా ఉదయం 4 గంటలకు వసంత్ రావ్ చవాన్ మరిణించారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దులకు సమీపంగా మహారాష్ట్ర నాందేడ్ నియోజకవర్గం ఉండడంతో చవాన్ హైదరాబాద్ కు చికిత్స కోసం వచ్చారు. 2024 సంవత్సరంలో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుడు వసంత్ రావ్ చవాన్.. బిజేపీ సిట్టింగ్ ఎంపీ ప్రతాప్ రావ్ పాటిల్ ని 59 వేల భారీ మెజారిటీతో ఓడించారు. వసంత్ రావ్ చవాన్ కు ఈ ఎన్నికల్లో 5,28,894 ఓట్ల లభించగా, ఆయన ప్రత్యర్థికి 4,69,452 ఓట్లు పొలయ్యాయి. ఎన్నికల సమయానికి చవాన్ ఆరోగ్యం బాగోలేదని సమాచారం. అప్పటికే మహారాష్ట్ర రాజకీయాలలో వసంత్ రావ్ చవాన్ సన్నిహితుడు మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ కాంగ్రెస్ ను వీడి బిజేపీలోకి చేరడంతో వసంత్ రావ్ గెలుపు క్లిష్టంగా మారింది. అయినా వసంత్ రావ్ కు ఎన్నికల్లో భారీ ప్రజాదరణ లభించింది. నాందేడ్ లోని నాయిగావ్ జిల్లా లో జన్మించిన వసంత్ రావ్ చవాన్ గ్రామ పంచాయితీ సభ్యుడిగా సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆ తరువాత 1990 నుంచి 2002 వరకు జిల్లా పరిషద్ సభ్యుడిగా పనిచేశారు. 2002లో వసంత్ రావ్ మహారాష్ట్ర ఎమ్మెల్సీ గా ఎన్నికయ్యారు. ఆ తరువాత 2009లో నాయి గావ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో కూడా ఆయన కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. వసంత్ రావ్ చవన్ 2021 నుంచి 2023 వరకు నాందేడ్ జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వర్తించారు. వీటితో పాటు జనతా హై స్కూల్, నాయిగావ్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ లో.. ట్రస్టీగా, చైర్ పర్సన్ పదవుల్లో ఉన్నారు. వసంత్ రావ్ చవాన్ మరణంతో మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక శూన్యం ఏర్పడిందని, రాష్ట్ర కాంగ్రెస్ ప్రెసిడెంట్ నానా పటోల్ అన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు విజయ్ వడెట్టియార్, ఇతర నాయకులు ఆయన నివాళులర్పించారు. "కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, నాందేడ్ ఎంపీ వసంత్ రావ్ జీ చవాన్ మరణించారనే వార్త మమల్ని కలిచివేసింది. ఆయన కాంగ్రెస్ పార్టీ పట్ల ఎల్లప్పుడూ విశ్వాసంగా ఉన్నారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా కాంగ్రెస్ పార్టీయే తన కుటుంబం అని నమ్మిన నాయకుడు. వసంత్ రావ్ మృతి వల్ల యావత్ కాంగ్రెస్ పార్టీ దు:ఖం లో ఉంది. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబానికి పార్టీ తోడుగా ఉంది." నానా పటోల్ ట్వీట్ చేశారు.




# మంచు ఫ్యామిలీ మూడో తరం

### 'కన్నప్ప'లో మంచు విష్ణు కొడుకు.. అవ్రామ్ ఫస్ట్ లుక్

మంచు ఫ్యామిలీ నుంచి మరో తరం ఎంట్రీ ఇస్తుంది. టాలీవుడ్ సినీయర్ కథానాయకుడు మంచు మోహన్ బాబు మనవడు, మంచు విష్ణు కొడుకు అవ్రామ్ 'కన్నప్ప'లో చిత్రంలో ఓ కీలకమైన పాత్రలో నటించబోతున్నాడు. నేడు కృష్ణాష్టమి పండుగా సందర్భంగా చిత్రబృందం విషెస్ తెలుపుతూ.. అవ్రామ్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇక అవ్రామ్ ఇందులో తిన్నడు అనే పాత్రలో నటించనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. కన్నప్ప(మంచు విష్ణు) చిన్నప్పటి పాత్ర తిన్నడుగా అవ్రామ్ కనిపించనున్నట్లు వెల్లడించింది. ఇక మంచు కుటుంబం నుంచి మూడో తరం ఎంట్రీ ఇస్తుండటంతో అభిమానులతో పాటు నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మంచు ఫ్యామిలీ నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు.



### బస్సుల్లోంచి ప్రయాణికుల్ని దించి.. పాకిస్థాన్‌లో
# 23 మందిని కాల్చేశారు

పాకిస్థాన్‌లోని బలోచిస్తాన్‌లో ఉన్న ముసాఖేల్ జిల్లాలో.. ఉగ్రవాదులు 23 మంది ప్రయాణికుల్ని కాల్చి చంపారు. ట్రక్కులు, బస్సుల్లో ఉన్న ప్రయాణికుల్ని దించి తమ వద్ద ఉన్న తుపాకులతో షూట్ చేశారు. ఐడెంటీలను గుర్తించిన తర్వాత ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ముసాఖేల్, రారాషామ్ హైవేపై బస్సులను ఆపి, దాంట్లో నుంచి ప్రయాణికుల్ని దించి, వాళ్లపై ఉగ్రవాదులు కాల్పులు జరిపినట్లు అసిస్టెంట్ కమీషనర్ ముసాఖేల్ నజీబ్ కాకర్ తెలిపారు. కాల్పుల్లో చనిపోయిన వారు అంతా పంజాబ్‌కు చెందినట్లు ఆయన చెప్పారు. మొత్తం 10 వాహనాలకు సాయుధులు నిప్పుపెట్టారు. ఈ ఉగ్ర చర్యను బలోచిస్తాన్ సీఎం సర్ఫరాజ్ బుగ్తి ఖండించారు.



### 'ముఫాసా'కి మహేష్ బాబు గొంతు.. గూస్‌బంప్స్ తెప్పిస్తున్న
# 'లయన్ కింగ్' తెలుగు ట్రైలర్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్‌బాబు హాలీవుడ్ విజువల్ వండర్ 'ముఫాసా: ది లయన్ కింగ్' తెలుగు వెర్షన్‌కు డబ్బింగ్ చెప్పాడు. ఇందుకు సంబంధించిన ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. హాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'ది లయన్ కింగ్' సినిమాకు 'ముఫాసా: ది లయన్ కింగ్' అంటూ ప్రీక్వెల్ వస్తున్న విషయం తెలిసిందే. ఇక ఈ చిత్రం డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను విడుదల చేయగా.. యూట్యూబ్‌లో రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుంది.తెలుగుతో పాటు హిందీ తదితర భాషల్లో అక్కడి నటులతో డబ్బింగ్ చెప్పిస్తున్నారు మేకర్స్. ఇప్పటికే హిందీలో షారుఖ్ ఖాన్ ముఫాసా పాత్రకు డబ్బింగ్ చెప్పగా.. తాజాగా తెలుగులో అగ్రకథానాయకుడు మహేశ్ బాబు తన గాత్రాన్ని అందించారు. ఈ మూవీలో అడవి రాజు అయిన ముఫాసా పాత్రకు మహేశ్ డబ్బింగ్ చెప్పగా.. పుంబా కోసం బ్రహ్మానందం, టిమోన్ పాత్ర కోసం అలీ తమ వాయిస్‌ను అందిస్తున్నారు. తాజాగా తెలుగు వెర్షన్‌కు సంబంధించిన ట్రైలర్‌ను మహేశ్ బాబు ఎక్స్ వేదికగా విడుదల చేశారు. తెలుగులో ముఫాసా పాత్రకు వాయిస్‌ని అందించినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైనది అంటూ ప్రిన్స్ రాసుకోచ్చాడు.

# 102 ఏళ్ల వయసులో బామ్మ స్కైడైవింగ్

102 ఏళ్ల వయసున్న వృద్ధురాలు అనగానే సాధారణంగా మనకు చేతిలో కర్ర, బోసి నవ్వులు గుర్తుకువస్తాయి. సొంతంగా పనులు చేసుకోవడానికి కూడా వారు ఇబ్బందులు పడుతుంటారు. కానీ ఈ బామ్మ మాత్రం మన ఆలోచనలను తలకిందులు చేసి, మేము కూడా యువతకు ఏ మాత్రం తీసిపోము అంటూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇంతకీ ఆమె ఏమి చేసిందంటే.. బ్రిటన్‌లోని బెన్‌హాల్ గ్రీన్ ప్రాంతానికి చెందిన బామ్మ మానెట్ బైల్లీ(102) ఆదివారం తన పుట్టినరోజు సందర్భంగా తనకు ఎంతగానో ఇష్టమైన స్కైడైవింగ్ చేయాలనుకుంది. అనుకున్నదే తడవుగా బెక్లెస్ ఎయిర్‌ఫీల్డ్‌లో 2,100 మీటర్ల (6,900 అడుగుల) ఎత్తులో స్కైడైవింగ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. యూకేలో అత్యంత వృద్ధ స్కైడైవర్‌గా రికార్డు సృష్టించింది. అనంతరం స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఈవిధంగా సాహసాలు చేయడం తనకు మొదటిసారి కాదని రెండేళ్ల క్రితం తన 100వ పుట్టిన రోజు సందర్భంగా ఫెరారీ కారును సొంతంగా డ్రైవ్ చేస్తూ గంటకు 210 కిలోమీటర్ల (గంటకు 130 మైళ్లు) వేగంతో సిల్వర్‌స్టోన్ మోటార్ రేసింగ్ సర్క్యూట్ చుట్టూ రేసింగ్ చేశానని పేర్కొంది. వయసుతో సంబంధం లేకుండా అందరూ ఇటువంటి వాటిలో పాల్గొనాలని, వీటివల్ల మనలో ఉత్సాహం మరింత రెట్టింపు అవుతుందని తెలిపింది. గతంలో తన స్నేహితురాలి తండ్రి 85ఏళ్ల వయసులో స్కైడైవింగ్ చేయడంతో ఆశ్చర్యపోయానని, తాను కూడా ఆవిధంగా చేయాలనే ఆలోచనతో ఈ పుట్టిన రోజున స్కైడైవింగ్ చేశానని ఆమె చెప్పుకొచ్చింది. అయితే 2018లో కూడా ఓ 102 ఏళ్ల బామ్మ ఐరీన్ ఓషియా 14,000 అడుగుల ఎత్తులో స్కైడైవింగ్ చేసి ఆహా అనిపించింది.



# రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

రాష్ట్రంలో డెంగీ మరణాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డెంగీ మరణాలు లేవని ప్రభుత్వం చెబుతుంది. కానీ వార్తా పత్రికల్లో మాత్రం ఒక్కరోజులో ఐదు మంది డెంగీతో చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. డెంగీతో మరో ముగ్గురు చనిపోయినట్లు ఇవాళ కూడా వార్తా పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ డేటాను ఎవరు దాచిపెడుతున్నారు..? ఎందుకు దాచిపెడుతున్నారు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులు లేవు.. చాలా హాస్పిటల్స్‌లో ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురు ఉండి ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ పరిస్థితిని సీరియస్‌గా పరిగణించి, రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీఎస్ శాంతికుమారికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.



# నా పోరాటం ఇప్పుడే మొదలైంది: వినేశ్



పారిస్ ఒలింపిక్స్‌లో భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు కొద్దిలో పతకం చేజారింది. రెజ్లింగ్ 50 కేజీల విభాగంలో ఫైనల్‌కు ముందు అనర్హతకు గురైన సంగతి తెలిసిందే. కేవలం 100 గ్రాముల బరువు అదనంగా ఉందంటూ అంతర్జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్ అనర్హత వేటు వేసింది. కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ లోనూ చుక్కెదురైంది. తీవ్ర మనో వేదనతో పారిస్ నుంచి భారత్‌కు చేరుకున్న వినేశ్‌కు అద్భుత స్వాగతం లభించింది. ఆమె స్వగ్రామం హరియాణాలోని బలాలిలోనూ గ్రాండ్ వెల్‌కమ్ దక్కింది. తాజాగా ఆమె పుట్టిన రోజు సందర్భంగా బలాలి గ్రామ పెద్దలు విభిన్నంగా సత్కరించారు.